క్లుప్తంగా

నేడు తెలుగు ప్రతిభా పరీక్ష

కందనూలు: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని 21న తెలంగాణ తెలుగు సబ్జెక్టు ఫోరం ఆధ్వర్యంలో క్లాస్‌మేట్ సహకారంతో జిల్లా స్థాయి తెలుగు ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఫోరం జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సత్యసాయి సేవ మందిర్‌లో పరీక్ష నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉదయం 10 గంటలలోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

23 నుంచి బ్రహ్మోత్సవాలు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో లక్ష్మీపద్మావతి సహిత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను 23వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు గురువారం నిర్వాహకులు పేర్కొన్నారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభంకానున్నాయి. భగవద్గీత, విష్ణు సహస్ర పారాయణం తోపాటు సాయి భజనలు సాయంత్రం స్వామి వారి ఎదుర్కోలు కార్యక్రమాలు ఉంటాయి. 24న శివానంద స్వామి ప్రవచనాలు సాయంత్రం ఏడు గంటలకు వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. 25న గరుడ సేవతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ కల్వ మనోహర్ చెప్పారు.

ఎల్లమ్మ ఆలయం ముస్తాబు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ గుడిని గురువారం విద్యుత్ బల్బులతో అలంకరించారు. మంగళవారం నుంచి ఎల్లమ్మ వేడుకలను నిర్వహిస్తున్నారు. 7 రోజులపాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. గుడిలో ఎల్లమ్మ దేవత విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయవ కమిటీ వారు తెలిపారు.

చిన్నముద్దునూరులో వైద్య శిబిరం

తెలకపల్లి: మండలంలోని చిన్నముద్దునూరులో గురువారం సంపూర్ణ సురక్ష కేంద్ర ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. హెచ్ఐవీతో పాటు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ, ఎయిడ్స్, సెపిలిస్, హైపొటైటిస్-బీ, సీ తదితర వ్యాధులపై వైద్యురాలు కల్పన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పరమేష్ రెడ్డి, సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ శివకుమార్, ఓఆర్ డబ్ల్యూ సురేందర్, ఎస్ఎంలు పద్మ, అరుణ, ఆశాకార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



తిమ్మాజిపేట: మండల కేంద్రానికి చెందిన జోగు శివ ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06వ బ్యాచ్‌కు చెందిన మిత్రులు డబ్బులను పోగు చేసుకొని గురువారం బాధిత కుటుంబానికి రూ.50 వేలు అందజేశారు. అనంతరం శివ కూతురు పేరుపై పోస్టాఫీసులో డబ్బులను ఫిక్స్‌డ్ చేశారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

తాడూరు: మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని ఇంద్రకల్, యాదిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆయన నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నర్సరీ నిర్వాహకులకు మొక్కల పెంపకం, వాటిని సంరక్షించే విధానం, వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. రైతులకు అవసరమైన మొక్కలను అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట ఏపీఓ చంద్ర సిద్ధార్థ, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

మైనార్టీల అభివృద్ధే ధ్యేయం

చారకొండ: మైనార్టీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని జూపల్లిలో గ్రామానికి చెందిన ఖాజామైనోద్దీన్ సొంత డబ్బులతో గ్రామంలో మదర్సా ఇస్లామియా, ఉర్దూఘర్‌ను నిర్మించాడు. ఈమేరకు గురువారం ఎమ్మెల్యే వాటిని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేను ముస్లింలు సన్మానించారు. సురేందర్ రెడ్డి, నాయకులు రాములు యాదవ్, బాలేమియా ఉన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

తిమ్మాజిపేట: మండలంలోని కోడుపర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో దేశభక్తి పాటలకు అనుగుణంగా విద్యార్థులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణశెట్టి, హెచ్ఎం సుధాకర్‌రెడ్డి, సాంబయ్య, స్వప్న, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

- వాహనదారులకు తప్పని అవస్థలు
- మరమ్మతుకు నోచుకోని వైనం



యాదిరెడ్డిపల్లి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు



గుంతలమయంగా మారిన ఎత్మతాపూర్‌కు వెళ్లే రహదారి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో రహదారులు, లింకు రోడ్లు గుంతలమయంగా మారాయి. ఏళ్ల తరబడి రహదారుల అభివృద్ధి చేయకపోవడం, కనీసం మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లకు ఇరువైపులా కంపచెట్లతో పాటు పిచ్చి మొక్కలు అల్లుకొని ఉండటంతో రాకపోకలకు అవాంతరాలు ఎదురవుతున్నాయి. దారిపొడవునా గుంతలు దర్శనం ఇవ్వడంతో ఆయా గ్రామాణ ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. లింకు రహదారుల మరమ్మతుపై అధికారులు అశ్రద్ధ కనబర్చుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

మండలంలో ఇలా..

మండల కేంద్రం నుంచి యాదిరెడ్డిపల్లి వెళ్లే లింకు రోడ్డు అనేక మలుపులు ఉన్నాయి. అదేవిధంగా రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు అల్లుకోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాద బారిన పడుతున్నారు. ఇంద్రకల్ నుంచి ఎత్మతాపూర్–తుమ్మలసుగురు మీదుగా కుమ్మెర వెళ్లే 9 కిలోమీటర్ల ఈ రోడ్డు బీటీ తేలి అధ్వానంగా దర్శనమిస్తోంది. అదేవిధంగా ఐతోలు నుంచి కొమ్ముకుంటతండాకు వెళ్లే మట్టి రోడ్డు వర్షాకాలంలో బురదమయంగా మారుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రం నుంచి పోలేంపు రోడ్డు బీటీకి నోచుకోక పోవడం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. అల్లపూర్ నుంచి పొల్మూరు మీదుగా గుట్టల వెళ్ళే రోడ్డు, పాపగల్ నుంచి బలాన్‌పల్లి వెళ్లే రోడ్ల పరిస్థితి దయనీయంగా మారాయి.

పట్టించుకోని అధికారులు

సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టుంచుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. వారం రోజుల కిందట మండల కేంద్రం నుంచి యాదిరెడ్డిపల్లి వరకు ఉన్న లింకు రోడ్డుపై ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీకొని పలువురికి గాయాలు అయ్యాయి. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

మరమ్మతు చేయాలి



మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలను కలిపే లింకు రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రయాణం నరక యాతనగా మారింది. అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం లింకు రోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మతులను చేపట్టాలి.

–కురుమూర్తి, యాదిరెడ్డిపల్లి

లింక్ రోడ్లను పరిశీలిస్తాం...

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలను కలిపే లింకు రోడ్ల పురిస్థితిని పరిశీలించి ప్రతిపాదనలను పంపిస్తాం.సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

–ఆంజనేయులు, ఎంపీడీఓ, తాడూరు

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



గిరిజన బాలికలతో మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ బదావత్ సంతోష్‌లు

కొల్లాపూర్: గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం పట్టణంలో సంత్‌సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని మాధవస్వామి దేవాలయం నుంచి ఈదమ్మగుడి సమీపంలో ఉన్న గిరిజన కమ్యూనిటీ హాల్ వరకు లంబాడీలు బైక్ ర్యాలీ నిర్వహించారు. కమ్యూనిటీ హాల్‌వద్ద మహాభోగ్ వేడుకలు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు, కలెక్టర్ బదావత్ సంతోష్ హాజరై మాట్లాడారు. సేవాలాల్ జయంతి వేడుకల నిర్వహణకు ప్రభుత్వం రూ.3 కోట్లు విడుదల చేసిందన్నారు. విద్య, ఉపాధి అవకాశాల్లో గిరిజనులకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. బంజారా జాతిని చీకటి నుంచి వెలుగులోకి తీసుకువచ్చిన మహనీయుడు సేవాలాల్ అని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ ఆశయాల సాధనకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఫిరంగి, ఆర్డీఓ భన్సీలాల్, గిరిజన సంఘం నాయకులు హన్మంతునాయక్, బన్సీరాం నాయక్, శంకర్, గోవింద్, శ్రీరామ్, అశోక్, బాలు, సేవ్యానాయక్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుతాం



మాట్లాడుతున్న రాములు

కల్వకుర్తి రూరల్: సివిల్ సప్లయ్ గోదాంలలో పనిచేస్తున్న హమాలీల సమస్యలు పరిష్కరించేవరకు పోరాడుతామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగూరు రాములు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సివిల్ సప్లయ్ గోదాం ఆవరణలో హమాలీల జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాములు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం హమాలీల డిమాండ్లను నెరవేర్చడంలో విఫలం అయ్యిందన్నారు. ప్రస్తుతం సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మెకు దిగి ఒప్పందం మేరకు జీఓ సాధించుకున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5వేల మంది హమాలీలు గోదాములలో పనిచేస్తున్నారని వివరించారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి, 4 లేబర్ కోర్డులను తీసుకొచ్చి కార్మికులకు సమ్మె చేసే, సంఘం పెట్టుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. హమాలీల హక్కుల కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు పర్వతాలు, కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుక బాల్ రెడ్డి, బి శ్రీనివాసులు, మల్లయ్య, బాలయ్య, యాదయ్య, పర్వతాలు, బీరయ్య, మల్లేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

నాగర్‌కర్నూల్‌రూరల్: మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించకుండా, తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని ఆరోపించారు. పట్టణాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు పైబడిన కార్మికుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు కుర్మయ్య, శ్రీను, చెన్నయ్య, మహిమూద్, మల్లేష్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్దండ: మండలంలోని కుప్పగండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఈ నెల 21వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సూర్యంనాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

కల్వకుర్తి టౌన్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి జరిమానాతో పాటుగా జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో రెండు రోజుల కిందట నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలో పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన పద్మాన్‌కుమార్ మద్యం తాగి వాహనం నడుపుతుండగా పట్టుబడ్డాడు. అతనిని కోర్టులో హాజరుపరచగా ఒక రోజు జైలుశిక్షతో పాటుగా, రూ.100 జరిమానాను జడ్జి కావ్య విధించారు.

ట్రంక్ పెట్టెలు పంపిణీ



లింగాల: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు ప్రభుత్వం సరఫరా చేసిన ట్రంక్ పెట్టెలను గురువారం ఏటీడీఓ యాదమ్మ, హెచ్ఎం మంగమ్మ పంపిణీ చేశారు. మొత్తం 326 మందికి పెట్టెలను అందజేసినట్లు ఏటీడీఓ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సాగుపై క్షేత్రస్థాయిలో అవగాహన



లింగాల: వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి గురువారం మండలంలోని సూరాపూర్‌లో అచ్చంపేట పట్టణంలో కాకతీయ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనకు తరలివచ్చారు. మాగాణీ, మెట్ట పంటల సాగును రైతులు ఏ విధంగా చేస్తారనే దానిపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. వరి, ఇతర ధాన్యాలను పండించే విధానం గురించి కొంత మంది రైతులు విద్యార్థులకు వివరించారు.

మెగా జాబ్‌మేళాలో 120 మందికి ఉద్యోగాలు



బల్మూర్: మండలంలోని కొండనాగుల ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఐక్యూసీ, టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 120 మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ పరంగి రవి తెలిపారు. జీఎంఆర్ ఫౌండేషన్, ముత్తూట్ ఫైనాన్స్, టెక్ మహేంద్ర, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించినట్లు పేర్కొన్నారు. సహకరించిన కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

అంబట్‌పల్లిలో ఉద్రిక్తత



అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ, సింగిల్ విండో చైర్మన్

లింగాల: మండలంలోని అంబట్‌పల్లిలో సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి తన ఇంటికి కొద్ది దూరంలో కొన్ని సంవత్సరాల కిందట నిర్మించిన గోడ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ఈ నెల 18న మంగళవారం జిల్లా రెవెన్యూ సర్వేయర్, మండల రెవెన్యూ సర్వేయర్‌తో కలిసి సర్వే నిర్వహించారు. సర్వే నంబర్ 732లో 5.29 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో కొంత మంది ఆక్రమించుకొని ఉన్నారని అధికారులకు ఫిర్యాదులు అందాయి. అయితే సింగిల్ విండో చైర్మన్ నిర్మించిన గోడ కొంత మేరకు ప్రభుత్వ భూమిలో ఉండడంతో వివాదంగా మారింది. గురువారం గోడను కూల్చి వేయించేందుకు గ్రామానికి తహసీల్దార్ పాండునాయక్, రెవెన్యూ సిబ్బంది పోలీసులతో కలిసి యంత్రాలు తీసుకెళ్లారు. దీంతో అధికారులతో సింగిల్‌విండో చైర్మన్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కొన్నేళ్ల నుంచి ఈ భూమి మా స్వాధీనంలోనే ఉందని సింగిల్ విండో చైర్మన్ తెలిపారు. అధికారులు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సర్వే నిర్వహించారని పేర్కొన్నారు. ఎలాంటి నోటీసులు కూడా ఇవ్వకుండా అకస్మాత్తుగా వచ్చి కూల్చివేయడం ఎంత వరకు సమంజసమని చైర్మన్‌తో పాటు మాజీ ఎంపీపీ జగపతిరావు అధికారులను ప్రశ్నించారు. నిర్మించిన గోడ కొంత భాగం ప్రభుత్వ భూమిలో ఉంటే తానే స్వచ్ఛందంగా తొలగించుకుంటానని తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకోవడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. చేసేది లేక అధికారులు కూల్చి వేతను విరమించుకొని వెనుదిరిగారు. ఈ విషయంపై తహసీల్దార్ పాండునాయక్ వివరణ కోరగా సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వ భూమిలో కొంత మంది అక్రమంగా డబ్బాలను ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నారని వివరించారు.

ఎమ్మెల్యేకు వినతి



చారకొండ: మండలంలో రెండో విడతగా అర్హులందరికీ దళిత బంధు యూనిట్లు పంపిణీ చేయాలని ఎంపికైన అభ్యర్థులు కోరారు. గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి మండలంలోని జేపల్లి, గోకారం, ఎర్రవల్లి, శేరి అప్పారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన దళితబంధు దరఖాస్తుదారులు వినతి పత్రం అందజేశారు. యూనిట్ల పంపిణీకి నిధులు కేటాయించాలని కోరారు. రెండో విడతలో 279 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారని వివరించారు. కార్యక్రమంలో దళిత బంధు సాధన కమిటీ సభ్యులు వంకేశ్వరం రమేష్, మల్లేష్, రమేష్, వెంకటేష్, ఓంకార్, మధు, అశోక్, శేఖర్, మల్లేష్, శారద, లక్ష్మి, దాసు, రవికుమార్, తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇవ్వాలి

తాడూరు: అర్హులందరికి సంక్షేమ పథకాలు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గుంతకోడురులో కేవీపీఎస్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఉచిత విద్యుత్, రేషన్‌కార్డులు, భూమిలేని పేదలకు ఆత్మీయ భరోసా వంటి పథకాలను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు వెంకటస్వామి, రామస్వామి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



పెంట్లవెల్లి: మండలంలోని ఎంగంపల్లి తండాలో ఎక్సైజ్, పోలీసు అధికారులు గురువారం సారా తయారీకేంద్రాలపై దాడులు నిర్వహించారు. 250 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అనంతరం ఎస్ఐ రామన్‌గౌడ్ మాట్లాడుతూ సారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

దుస్తుల అందజేత



అచ్చంపేట: పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని గురువారం ఏఎస్‌డీఓ శ్రీకర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు నాలుగు జతల దుస్తులను అందజేశారు. విద్యార్థులకు అందుతున్న భోజనం, సౌకర్యాలు, వసతులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులు బాగా చదివి 10/10 జీపీఏ సాధించాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆధికారి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పౌష్టికాహారం అందించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న కమిషనర్ యాదయ్య

అచ్చంపేట రూరల్: విద్యార్థినులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని మున్సిపల్ కమిషనర్ యాదయ్య ఆదేశించారు. గురువారం మండలంలోని నడింపల్లి కస్తూర్బా పాఠశాలను స్పెషల్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ యాదయ్య పరిశీలించారు. వంటగది, కూరగాయలు, ఇతర సామాగ్రిని పరిశీలించి ప్రస్తుత పరిస్థితుల్లో తాజా కూరగాయలనే వాడాలని, చికెన్, గుడ్లు తగ్గించాలన్నారు. అనంతరం ఆర్‌డీటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నీటిని పొదుపు చేయాల్సిన ఆవశ్యకత, ఏఏ మార్గాల ద్వారా నీటిని పొదుపు చేయవచ్చు అనే అంశంపై విద్యార్థినులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఎస్ఓ కుసుమ, ఆర్‌డీటీ సంస్థ ప్రతినిధులు ఆంజనేయులు, రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలెం వెంకన్నను దర్శించుకున్న డీఈఓ

బిజినేపల్లి: మండలంలోని పాలెం శ్రీవేంకటేశ్వర స్వామిని డీఈఓ రమేష్‌కుమార్ గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ మాజీ ధర్మకర్త సురేందర్ డీఈఓను శాలువాతో సన్మానించి సత్కరించారు. ఆలయ అర్చక బృందం డీఈఓకు తీర్థప్రసాదాలు అందించిన ప్రత్యేక ఆశీర్వచనాలు చేశారు. ఆయన వెంట జీహెచ్ఎం నరహరి నాగేందర్, వెంకటశెట్టి, గోపాలస్వామి, మధు, శంకర్ తదితరులున్నారు.

శివమాలధారులకు పండ్లు పంపిణీ

కందనూలు: నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని నాగనూల్ ఫ్రెండ్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కాలినడకన శ్రీశైలం వెళ్తున్న శివ భక్తులకు గురువారం పండ్లు, వాటర్‌బాటిళ్లు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు మహేష్, రాజు పాల్గొన్నారు.

అన్నదానం

దోమలపెంట: హైదరాబాద్‌కు చెందిన భాగ్యనగర్ శివదీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం దోమలపెంటలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అటవీ చెక్‌పోస్ట్ దాటిన వెంటనే రోడ్డు పక్కనే శివమాలధారులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం, అల్పాహారంను అందిస్తున్నారు. భాగ్యనగర్ శివదీక్షా సేవ సమితి అధ్యక్షుడు కె.జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్, మాదిశెట్టి లక్ష్మీనారాయణలు ఉన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

మన్ననూర్: అపోలో టోటల్ హెల్త్ ఆధ్వర్యంలో వారం రోజులుగా చింతల చెరువు సమీపంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా క్రీడా పోటీలలో గెలుపొందిన టీమ్ సభ్యులకు ఎఫ్‌డీఓ రాంమూర్తి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి మన్ననూర్‌కు చెందిన ఫ్రెండ్స్ సీసీ టీమ్‌కు, రెండో బహుమతి జంగిల్ నాచురల్ టీమ్ సభ్యులకు అందజేశారు. ఓం ప్రకాష్, అనుక్‌కుమార్, కేశవులు, కుమార్, మల్లేష్, రవి, డాక్టర్ రాజశేఖర్, జావీద్, శ్రీరాం నాయక్ పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు

వెల్దండ: మండలంలోని గుండాలలో గురువారం కోనేరులోని చెత్తచెదారం తొలగించారు. నీటిలో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. అదే విధంగా పెద్దరథోత్సవం వద్ద కాంక్రీట్‌తో సీసీ వేశారు.

డీటీఓలో నాగుపాము కలకలం



నాగర్‌కర్నూల్ క్రైం: మండలంలోని మల్కాపూర్ గేటు సమీపంలో ఉన్న జిల్లా రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో నాగుపాము కలకలంరేపింది. గురువారం కార్యాలయంలో యధావిధిగా కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఉదయం గేట్ నుంచి కార్యాలయం ఆవరణలోకి నాగుపాము ప్రవేశించింది. వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు స్నేక్ క్యాచర్ తెప్ప వంశీకి సమాచారం అందించడంతో ఆయన ఘటన స్థలానికి చేరుకొని నాగుపామును డబ్బాలో బంధించి పొలాలలో వదిలిపెట్టాడు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఓర్వలేకే కాంగ్రెస్ నాయకుల విమర్శలు

కల్వకుర్తి రూరల్: రైతుల సమస్యలపై ఆమనగల్‌లో కేటీఆర్ దీక్ష విజయవంతం కావడంతో కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ మార్కెట్ చైర్మన్ సింగం విజయ్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. రైతులు కాంగ్రెస్ పాలనలో సంతోషంగా ఉన్నారని బాలాజీసింగ్ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రుణమాఫీపై, రైతుభరోసాపై పూర్తి సమాచారం అధికారులను అడిగి తెలుసుకోవాలని కాంగ్రెస్ నాయకులకు హితువు పలికారు. పాల బిల్లులు ఎందుకు నిలిచిపోయాయో ప్రజలకు తెలపాలన్నారు. సమావేశంలో అంజి యాదవ్, గుండ్య నాయక్, యాదయ్య గౌడ్, శ్రీను నాయక్‌లు ఉన్నారు.

బాలిక బలవన్మరణం

బిజినేపల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17) గురువారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. బాలిక హైదరాబాద్‌లో ఉన్న ఓ యువకుడితో తరుచూ ఫోన్ మాట్లాడుతుండేది. అయితే ఇటీవల యువకుడికి బాలికపై అనుమానం రావడంతో ఇంటికి వచ్చి వాగ్వాదానికి దిగాడు. అదే సమయంలో మరో యువకుడు సైతం వచ్చి గొడవపడ్డాడు. ఈ విషయాన్ని చుట్టు పక్కలవారు గమనించడంతో మనస్తాపానికి గురైన బాలిక ఇంట్లోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.